కథలు:

# నర్తోడు

శ్రీపతి

'ఈ వానలో శంకరయ్య నాయుడ్ని ఎలా కాలుస్తారో' అన్నాడు కృష్ణారావు.

నర్తోడికి ఆ గుర్తేలేదు. పదినాలుగా వాడి కుడికాలు బొటనవేలుమీద పుండు బాధిస్తున్నది. తెల్లారే మందనించొచ్చి బుగతోరి ఇంటికి ఓ కావిడు నీళ్ళిచ్చి మందు కోసం చాకలిరంగడు దగ్గరికివెళ్ళాడు. రంగడు రేవుదగ్గరున్నాడంటే అక్కడికెళ్ళాడు. అక్కడ ఆ మందు వేరికి కట్టి వచ్చేసరికి ఆలస్యమయింది. చల్లింది తినేసి మందకి వచ్చేసరికి గొర్రెలు ఒకటే అరుస్తున్నాయి. ఆ హడావిడిలో శంకరయ్య నాయుడు చనిపోయిన సంగతి మరచిపోయాడు.

'ఈ పాటికి ఎప్పుడో బుగ్గయిపోయుంటాడు. నీసూర్లోనున్నాను పీనిగని తీసికెలి పోయినారు'.

వెంటనే నర్తోడు కొడుకును గుర్తుతెచ్చుకున్నాడు ఇలాంటి వానకాలపురోజులే. చిన్నవయసు కాల్చకూడదని కావేటిలో మొగలిదొంకల దగ్గర పెద్ద గొయ్యితీసి-గొయ్యి తవ్వుతుంటే వాననీళ్ళు- ఏం కాదులేరా అని పాతిపెట్టారు. నక్కలు మళ్ళీ గోతిని తవ్వేసి శవాన్ని ఎత్తుకుపోతాయని మళ్ళీకప్పారు.

దాంతో కొంతసేపు నర్తోడుకి వేలుమీది పుండునొప్పి తెలీలేదు. ఆ కొంతసేపు నర్తోడుకి ముందున్న కృష్ణారావు కనిపించలేదు. వాన గొడుగుమీద పడుతున్న చప్పుడుగాని ఇసికనేలమీద సైతం నీరు పాయలుగా పారుతున్న దృశ్యంగాని కనిపించలేదు. ఆ కొంతసేపూ నర్తోడు పాతకాలం సముద్రింప్పుందు మునుచుండిపోయాడు.

ఒక్కసారి ఏదో గుర్తొచ్చినట్టయి 'లంజకొడుకులు దొరికిపోయినారా....' అన్నాడు గొణుగుతున్నట్టు, 'కన్నుమూసి కన్ను తెరచినంతలో అంతాచేసి రావాల. అప్పుడనగ ఎల్లి....' అని చుట్టూ కలయజూసాడు.

వర్షమే గాలికి తెరలు తెరలుగా ఊగులో కన్పిస్తున్నది.

ఆ వెళ్ళిన ముగ్గురు గొడుగులూ చిన్నగూడులాగ ఇసికలోగుచ్చి ఉన్నాయి. వాళ్ళ గొడుగుల్లో నర్తోడూ, కృష్ణారావూ ముడుచుకుని కూచున్నారు.

నర్తోడి తాటికమ్మలగొడుగు అది వాడి ఇల్లు లాంటిది. దాన్ని చాలా అలంకరించాడు. పాలపిట్టల రంగురంగుల ఈకలు పువ్వుల్లా లోపల పంజరానికి వేలాడగట్టాడు. చింతపురుగుల రెక్కలుమధ్యమధ్యన వేలాడదీసాడు. గొడుగు కర్రి ఎర్రగా నూనెలో వండేసాడు. లోపల తాళ్ళతో అందంగా ముడులేసాడు. అది నర్తోడుకి రెండో ప్రాణం. దాన్నొదిలి మందతో ఎప్పుడు నర్తోడు రాలేదు. ఎండకీ, వానకీ. అది తోడు.

తుమ్మల సవరయ్య తోట ఇప్పుడు ఈ వానలో కనిపించటంలేదుగాని దగ్గర్లోనే ఉంది. దుంపలు తవ్వుకుని రావటానికి తుంబడు, గడ్డయ్య. సోములూ వెళ్ళారు. ఇంకారాలేదు దొరికిపోయారేమో అని ఓ పక్క భయపడుతున్నాడు.

తుమ్మల సవరయ్య పెద్దరైతుకాడు. పేదోడు. దొంగతనం బయిటపడినా భయం లేదు. వాడు పెద్దల మధ్యకి తగువుకి వెళ్ళడు. పెద్దలంటే చాలాభయం. అచుట్టూ పెద్దరైతుల భూములు చాలా ఉన్నాయి. కాని వాళ్ళ భూముల్లోకెత్తే ఒకరోజు కాకపోతే ఇంకొకరోజన్నా దొంగతనం బయటపడిపోతుంది. పూళ్ళో తగువు పెట్తారు. తప్పు వేస్తారు. దొంగపోయింది పైసా అయితే దొంగలాడింది రూపాయి అంటారు. అంతా ముక్కపిండి బండిని అమ్మించో పశువుల్ని అమ్మించో– చిన్నరైతు అయితే– భూమిని అమ్మించో వసూల్చేస్తారు. పెద్దరైతుల తోటల్లో అందుకే అడుగు పెట్టరు. చిన్నరైతులంటే బతిమాలుకుంటే తిట్టి వూరుకుంటారు. ఆ ధైర్యంతోనే తుమ్మల సవరయ్య అరెకరా తోటలో దుంపలు తవ్వుకుని రావటానికి వెళ్లారు.

వెళ్లినవాళ్ళల్లో తుంబడు కత్తిలాంటివాడు. కాని వాడికి పాముల్ని చూసినా. పెద్దరైతుల్ని చూసినా, రాత్రిపూట వల్లికాడుని చూసినాభయం. వాడికి తోడుగావెళ్లిన సోములూ. గడ్డయ్యా గుంటలు. వాళ్ళకి తుంబడులాంటి వాళ్ళయితే లేదుగాని తెలివైనోళ్ళు. వీళ్ళు కాపలా ఉంటారు.

ఇంకా రాలేదు. వానకి జడసి ఎక్కడో ఏ పశులసాలల్లోనో కూచున్నారేమో అనుకుంటే వానకి లెక్కచేసేవాళ్ళుకారాయె. వానకి తడిసేవి వాళ్ళ వొంటిమీద ఏం లేవు. చిన్న గోచిపాతలాంటి పంచె నడుంచుట్టూ. తలకి చిన్నపాగా. ఏ పెద్దరైతు కళ్లల్లోనన్నా పడిపోయుంటారేమో. పట్టుకుని రాటకి కట్టేసి కొట్తుంటే దెబ్బలుతిని అనుస్తున్నారేమోనని నర్తోడి భయం.

'కుష్టారావో తడిసిపోతన్నావా?' నర్తోడు అడిగాడు. 'గొడుగు అటుపక్క వొంచు. జల్లు ఆ పక్కనించి కొట్తన్నాది'.

కృష్ణారావుకి ఈ పసులకాపరితనం ఇంకాకొత్త. నెలదినాల కిందటి వఁకు స్టూడెంట్. పరీక్షల్లో నెగ్గలేకపోయాడు. చదువులకి పనికిరాడని తండ్రి నిరాశపడిపోయి తెచ్చి వ్యవసాయంలోపెట్టాడు. ఇపుడు ఆవుల్ని మేపటం కృష్ణారావుకు చాలాబావుంది. చదువంటే, స్కూలంటే, టీచర్లంటే, స్కూల్ పిల్లలంటే భయమేర్పడి పోయింది. ఆ పాస్ మార్కులు అన్నవి ఎప్పుడూ హిమాలయ పర్వతాల దగ్గర ఉండిపోయేవి, వాటిని చేరుకోవటం కృష్ణారావుకు చేతకాలేదు,

నర్తోడులాగ మాటాడిన మనుషులని కృష్ణారావు చూడలేదు, అంత ప్రేమతో ఏ మేష్టరూ మాడాటలేదు. ఆ మేష్టర్లంతా ఎవరిమీదనో కసితోఉన్నట్టు బడికివచ్చి ఎవరి మీది కోపాన్నో క్లాసురూమ్‌లో అరుపుల్లోనూ తిట్లలోనూ కొన్నిసార్లు కొట్టటంలోనూ చూపి జిడ్డు మొహాల్తో వెళ్లిపోయేవారు. అడవుల్లో తిరిగే జంతువులు వచ్చేట్టుగా ఉండేవారు. మేష్టర్లని చూడాలంటే భయం. చదువు మానిపించేసినందుకు కృష్ణారావుకు చాలాహాయిగాఉంది, తుంబడు, గోనెబ్రాముడు, గడ్డయ్య. సోములు వీళ్ళంతా చాలా మంచివాళ్ళు. వందలు వందలున్న హైస్కూల్‌లో ఒకరిద్దరు కూడా మంచి స్నేహితులు ఏర్పడలేదు. ఆవుల్ని తోలుకుని వచ్చిన తొలిరోజునే వాళ్లంతా నేస్తులయి పోయారు. అందుకే వాళ్ళతోపాటు వెళ్తానన్నాడు దుంపలు తేవటానికి, నర్తోడు ఒప్పుకోలేదు.

'నీవు రైతు కొడుకువు. దొరికిపోతే పరువుపోతాది, ఆళ్ళు నాలుగు తన్నినా తింతారు, బరిస్తారు' అని పోనివ్వలేదు.

మొన్న పడిందివాన. నిన్నపడింది మళ్లీ. ఇసిక భూములు తడిసి మెత్తబడ్డాయి. చెట్టుపట్టుకుని సులువుమీద లాగితే మొత్తం దుంపలన్నీ గుత్తుగా వచ్చేస్తాయి. చెట్టుతో పట్టుకొస్తే అందరికీ సరిపోతాయి.

తిళ్లతేవటానికి వెళ్ళిన గోనెలాిముడు ఇప్పుడప్పుడేరాడు. వూరు మైలు దూరంలో ఉంది. వాడసలే నజ్జుమనిషి. ఏ పనీ చెకచెకా చెయ్యలేడు. వాడింకా వూళ్ళోనే ఎవరింటికాడో వుంటాడు. ఆ బుగతోరు తింపి తపేళాల్లోసర్ది ఉట్టిలోపెట్టి ఇవ్వాలి. అయిదు ఇళ్ళనించి అరకంగా ఆ తిళ్ళు తెచ్చి భుజానికి రెండు దిక్కులా వేలాడగట్టి మోసుకు రావాలి. ఈ వాన విడిచిందాకా వాడు వూరు విడిచిరాడు, ఈ వాన చూస్తే ఇప్పుడప్పుడే విడిచేట్టు కనిపించదు.

ఉదయం మందు కాలికి పెట్తూ చాకలి రంగడు 'కాలికి రెండ్రోజులు నీళ్ల తగల్నివ్వకురో' అన్నాడు. కాని ఎక్కడ కుదుర్తుంది. వానజల్లుని ఎంత ఆపుతున్నా నేలమీది భూమి తడితో పాదం తడిసిపోతూనేఉంది,

పశువులన్నీ ముడుచుకొని మర్రిచెట్టు కింద నుంచున్నాయి. ఈ వానకాలం గ్రేజింగ్ గ్రౌండ్‌గా విడిచేసిన ఈ బంజర్లు తప్పించి పశువులు అడుగు పెట్టటానికి ఇంకెక్కడా చోటు మిగల్లేదు. అన్నీ పంట పొలాలు కొబ్బరితోటలు చుట్టుపక్కల గ్రామాల పశువులన్నీ తిరగటంవలన గడ్డి ఇక్కడాలేదు ముళ్ల తుప్పలున్నాయి. అవి కొరుక్కుంటాయి. కట్టుమీద సాల్లో వదిలేస్తే వాటికి కాళ్లనొప్పులొస్తాయి. అందుకని ఈ బంబర్లకి వదలడం.

పొగాకు ముక్కతీసి ఒక చిక్కతెంచి నోట్లో వేసుకున్నాడు నర్తోడు.

దగ్గర ఉన్న తుప్పలుగూడా కనిపించటంలేదు. వాన కుండపోతగా కురుస్తున్నది. వాళ్ళు దగ్గరకొస్తేకాని కనిపించరు. వాళ్ళుతెచ్చే దుంపలుకోసం ఆశపడి ఎదురు చూస్తూ కూచున్నారు. కడుపు కనకన లాడిపోతున్నది. అనుకున్నదేమిటంటే వాళ్ళు ఆ దుంపలు తెస్తే కాల్చాలని, అక్కడ ఎండుపుల్లలన్నీ పోగేసి ఉంచారు. అవి ఈ వానకి తడిసిపోయాయి. కాల్చటం పడదు. పచ్చివే తినాలి.

'వొచ్చారు' అన్నాడు కృష్ణారావు. తుప్పలచాటున నీడలుకదిలే చూచి.

తుంబడు పొట్టిగా. సోములుకి కృష్ణారావు వయసు. గద్దయ్య సోములుకంటె వయసులో పెద్దే అయినా ఏదో జబ్బు ఉంది. వాడు బానకడుపుతో వేలాడుతున్న బుగ్గల్తో యీ చిన్నవయసుకే గుంటలుపడ్డ కళ్ళతో ఉంటాడు. అయితే చురుకుతనం ఏం తగ్గలేదు.

ముగ్గురూ చేతిలో ఒకటిరెండు చొప్పున పట్టుకుని వచ్చారు.

తెచ్చి నర్తోడు ముందు పడేసారు వెళ్ళి వాళ్ళ గొడుగులకింద కూచున్నారు.

నర్తోడు ఎర్రటి మనిషి. ఎండల్లో ఎండి బెల్లం రంగొచ్చింది వొంటికి. చిన్న గద్దకళ్లు, సన్నటి పెదాలు, సగంనెరిసిన మాసినగెడ్డం, మీసాలు పై పెదాలని కప్పేసి పడున్నాయి. తన ఆలోచన పనికొచ్చిందని సంతోషంలో ఉన్నాడు. ఒక మంచి లేతముక్క విరిచి కృష్ణారావుకు అందించి 'కుష్టారావో తిను' అన్నాడు.

వాళ్లు చలికి వొణికిపోతున్నారు. చూసి తన తలపాగాతీసి తుంబడికిస్తూ 'ఏమిరా ఇంత ఆలీసం' అని 'వొళ్లు తుడుసుకోండి'అని వాళ్ళవేపు ఒక్కొక్క దుంపవిసిరాడు.

నోట్లోని పొగాకు ఉమ్మేసి, తర్వాత నోరు ఖాండ్రించి మరోసారి ఉమ్మేసి ఒక దుంపతీసి చేత్తో తొక్క వొలుస్తున్నాడు.

'అదు సూసినట్టున్నాడోరి' అన్నాడు మళ్ళీ సోములు. వాడికి ఈమధ్యనే మగ గొంతు వచ్చింది. వాడికి గుండెమీద రొమ్ము మొనలు గడ్డలుకట్టి నొప్పెట్టున్నాయి.

వాడు ఎల్లప్పుడూ వాటిని వొత్తుకుంటున్నాడు. ఈ వానలో అయితే తిండిలో పడ్డాడు గాని ఖాళీగాఉంటే అదేపని. 'నీకు సమర్తాడే వొయసొచ్చిందిరా సోములూ' అని నవ్విస్తాడు నర్తోడు.

'ఎవడ్రా తుమ్మల సవరయ్యా?'అని అడిగాడు. సోములు చెప్పినమాటకి అనుమానం వచ్చింది. ఇదేదో కొంపమునిగినట్టున్నాదే అనుకున్నాడు.

'ఆడుకాడురా. తామాడ సుగ్రీవుల దావు. వస్తుంతే ఆ పక్క గుడ్డిలోని సాల్లోన ఆడు కనబడ్డాడు. సూసినట్టున్నాడు' అన్నాడు సోములు. ఓపక్క దుంప నములుతానే.

దుంప తినడం మాని తుంబడు దిక్కు చూసాడు నర్తోడు.

'ఆడు అయేళప్పుడు యానికుంతాడ్రా. నీ అనుమానంగాని. అన్నాడు గడ్డయ్య. అక్కడేచూసి సోములు గొణిగాడు. గడ్డయ్య వెతికిచూసాడు. ఎవరూ కనిపించలేదు. ఏచెట్టో మొక్కో చాటొచ్చిందో ఏమో.

తామాడ సుగ్రీవు అంటే కృష్ణారావుకి అసహ్యం. వాడు వయసులో పదేళ్ల పెద్ద ఉంటాడు. చిన్నప్పుడు చెర్లో స్నానం చేస్తుండగా వాడు కృష్ణారావుని నీళ్ళల్లో ముంచేసాడు. ఊపిరిపీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరయిపోయేవాడు. కేకలేసి అరిచి తిట్టేవాడు సుగ్రీవుని. వాడు మళ్ళీ పట్టుకుని నీళ్ళల్లోకి ముంచి అణిచిపెట్టేవాడు. వాడిని అంతా తిట్టేవారు. అయినా వాడేంమారలేదు. వాడి తండ్రికి వెధవ అప్పజెల్లెళ్ల ఆస్తి పదెకరాలు బంగారం ముప్పయినలభైతులాలు డబ్బు పది పదిహేనువేలు ఇళ్లు రెండు కలిసాయి. ఒక్కడేకొడుకు, వాడి ముద్దు అలాగేపెరిగింది.

'అడి గుడ్లోన దొంగలాడినా మేంటి? అడుసూస్తే?'అని తీసిపారేసాడు గడ్డయ్య

'అడికి మనం దొరికితే నర్రా. ఏ గుడ్డిలో దొంగలాడినా(వో వొద్దు. ఒకటి దొంగలాడితే పది దొంగలాడినావంటాడు. పక్కగుడ్డిలో తెస్తే ఆదిగుడ్డిలో తెచ్చినామంతాడు' అని వాడిగుణం చెప్పాడు నర్తోడు.

ఆ దుంపలు తినేసరికి వర్షం తెరిపిచ్చింది. మేఘాలు తెల్లబడ్డాయి. పశువులు వొళ్లు దులుపుకుని చెట్లకిందనించి బయటికి సాగిపోయాయి. గొర్రెలు చరికి వొణికిపోతున్నాయి.

ఆ పక్కనించి తుప్పలచాటున తామాడ సుగ్రీవు కనిపించాడని చెప్పాడు సోములు.

'వోరి వోరి ఆ తొక్కతీసేసి తుప్పల్లోనికి పారేయండ్రా' అన్నాడు గడ్డయ్య. గబగబా ఎవరికి అందింది వాళ్లు పారేసారు.

కృష్ణారావుచేతిలో చిన్నముక్క ఇంకా మిగిలింది. అదీ పారేసాడు. వస్తున్న తామాడ సుగ్రీవుని చూడనట్టుగా నర్తోడు గొర్రెలవేపు నడిచిపోయాడు. సోముల వాడి ఆవులు వెళ్లినవేపు దారితీసాడు.

గడ్డయ్య, తుంబడు, కృష్ణారావు ఎక్కడికివెళ్ళాలో తోచక అక్కడే ఉండి పోయారు. తుంబడు ఏమీఎరగనట్టు అమాయకంగా ముఖంపెట్టాడు. గడ్డయ్యకూడా నిబ్బరంగా ఉన్నాడు. అది కృష్ణారావుకు చేతకావటంలేదు.

వస్తూనే 'ఏమిరో దుంపలు బాగున్నాయా?'అని అడిగాడు తామాడ సుగ్రీవు. స్నేహితుడులాగా. పలకరిస్తున్నట్టు.

గుండె ఆగినంతపని అయింది. దూరంనించి వింటున్నాడు నర్తోడు.

'బాగున్నాయి బావు' అన్నాడు తుంబడు.

'ఏమిరో నర్తోడా, ఈళసేత ఈ పని సేయించినావు?' అని మంచి మంచి మాటల్తోనే అన్నాడు. కాని ఆ మాటలు విషంలో తడిసివచ్చినట్టున్నాయి.

'ఏంపని బావు?'

'నీ దొంగబుద్ది పోలేదుర దొంగలంజకొడకా' ఈసారికూడా మాటలు మెత్త మెత్తగానే అన్నాడు.

నర్తోడు నిజం చెప్పేస్తే బావుండుననిపించింది కృష్ణారావుకి. ఏంపని బావు అని తెలీనట్టు అడగడం నచ్చలేదు.

తామాడ సుగ్రీవు అటు నర్తోడువేపు నడుస్తున్నాడు.

నర్తోడంటే తామాడ సుగ్రీవుకు పడదని కృష్ణారావుకు తెలీదు. తామాడ సుగ్రీవు దగ్గర తనకొడుకును నర్తోడు కంబారిగా ఉంచాడు. కంబారితనం చేస్తున్నప్పుడే వాడు జబ్బుపడ్డాడు. జబ్బుపడినందుకు పంపకపోతే తిట్టాడు. కొంచెం నయిమయిందనేసరికి కొడుకును పనిలోకి పంపాడు. అక్కడ కొన్నాళ్ళకి ఆ ఇంట్లో పనులకీ వాళ్లపెట్టిన తిండికీ జబ్బు తిరగేసి కొడుకు చచ్చిపోయాడు. కొడుకు పీనుగముందుకూచుని నర్తోడు కడుపులోని దుఖ్కాన్ని దిగమింగుకోలేకపోయాడు. చేతి కందొచ్చిన కొడుకు చచ్చిపోయేసరికి వాడికి ఇంకో కారణం ఏదీ కనబడలేదు. రాచ్చసుడి ఇంట్లో పెట్టేసినానుకొడుకో, నిన్ను ఆడిపొట్టలో పెట్టేసికొన్నాడు కొడుకో. అని ఏడ్చాడు. దాంతో తామాడ సుగ్రీవుకి కోపమొచ్చింది. అప్పటికే కొడుకుమీద అప్పుచేసాడు. ఆ అప్పుతీర్చమని పట్టాడు తామాడ సుగ్రీవు. అది వూర్లో పెద్దమనుషుల దగ్గరికెల్లింది. తర్వాత గుర్రాల వరికాశం నాయుడు దగ్గర్నించి ఆ డబ్బు కక్కించాడు తామాడ సుగ్రీవు.



దానికీ మళ్లా ఏడ్చాడు నర్తోడు.

'అరే తుంబా, దుంపలుతెచ్చినావా లేదురా?' తుంబడువేపు తిరిగి దూరంనించే అడిగాడు.

'తెచ్చినాను. కాని మీ గుడ్డిలోకాదు బావు. తుమ్మల సవరయ్య గుడ్డిలోవిబావూ' అన్నాడు తుంబడు.

'బొంకులు బొంకకురా తుంబా. ఎక్కడ తిన్నావోసెప్పు?'

తుంబడు పూల రామయ్యనాయుడు కంబారి. వాడిని గట్టిమాట అనటానికి తామాడ సుగ్రీవుకు కొంచెం భయం. పూల రామయ్యనాయుడు ఆ వూళ్లో పెద్దరైతు. వాడికొడుకు పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్. వాడి తమ్ముడు బ్లాకులో యూడీక్లర్కు. వాడి అల్లుడొకడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్. అన్నిటికంటె ముఖ్యం పూల రామయ్య సర్పంచ్ దగ్గరమనిషి. వాడిమాటకి వూళ్లో విలువుంది. అలాంటి పెద్దరైతు పలుకుబడిగల పూల రామయ్యనాయుడు కంబారి తుంబడు. తామాడ సుగ్రీవుకు ఇది తెలుసును. వాడిమీద చెయ్యిచేసుకుంటే అది ముప్పే. అందుకే కొన్నిసార్లు తుంబడు ఇలాంటివాళ్లని లెక్క చేయడు.

మరి నర్తోడికి ఆ బలంలేదు వూళ్ళో పెద్దలకీ, గుర్రాల ప్రకాశం నాయుడుకీ ఎలక్షన్స్‌లో గొడవలొచ్చాయి. ఆ వూళ్లో ఒంటరివాడయిపోయాడు. వాడిమాటకి పలికే మనిషిని లేకుండాచేసారు పెద్దలంతాకలిసి. అదినర్తోడుమీద తామాడ సుగ్రీవుకు ఒక బలం.

చేతిలోని కర్రి గట్టిగా పట్టుకుని వెళ్లి నర్తోడుమీద పడ్డాడు.

గొడుగు అడ్డం పెట్టుకున్నాడు నర్తోడు.

నాలుగుదెబ్బలకి ఆ గొడుగు చిరిగిపోయింది. అది చిరిగిపోతున్నప్పుడు గుండె చిరిగిపోతున్నట్టనిపించింది. వాడి ఇల్లులాంటి గొడుగు. తోడూనీడా గొడుగు.

'బాబ్బాబు కొట్టకొక్కట్టకు. తప్పయిపోయింది బాబో. నీ కాళ్ళమొక్కుతాను సుగ్రీవుబాబో.' అని అరిచాడు. అయినా తామాడ సుగ్రీవు ఆగలేదు. వాడు సన్నగా పొడుగ్గా ఉన్నాడు. ఆ కోపంతో వాడి ముక్కుచరాలు విచ్చుకుని బుసలుకొట్టున్నాయి. వాడు కరవటానికి పైబడే కుక్కలా చూస్తున్నాడు. చేతిలోని కర్రివిసిరి బలంగా కొట్టున్నాడు. దెబ్బలు వొంటిమీద ఒకదగ్గరకాదు. కుడిచేతి ఎముకమీద. పీపుమీద, ఎడం భుజంమీద. మోకాలి పిక్కలమీద.

నాలుగయిదు దెబ్బలు తగిలినతర్వాత అంతవరకూ గొడుగుతో ఆపుకుంటున్న వాడు గొడుగు రక్షించలేదని అటు తుప్పల్లోకి పారేసి బూతులు తిట్టుకుని తిరగబడ్డాడు. ముందు కర్రిందుకుని తామాడ సుగ్రీవు చేతుల్లోంచి లాగిపారేసాడు. వాడి ఏభైయ్యేళ్ల వయసులోనూ ఆ కోపం వాడెరగడు. పిడికిలితో కడుపులో పొడిచాడు. ఒక తన్ను

కసితో తన్నాడు. ఆ దెబ్బలకి తామాడ సుగ్రీవు కిందపడ్డాడు. 'లంజకొడకా. నాకొడుకును సంపినావు. నామీద పడ్డావు. ఇక్కడే గొయ్యితవ్వి నీకు పాతేస్తాన్రా. అయ్యా బాబూ అని బతిమాల్తే కొమ్ములొస్తన్నాయిరా. ఒరే తామాడు సుగ్రీవు– నీను సస్తే నాకోసం ఏడిసేవోళ్లలేరు. నీవు సస్తే లంజకొడకా నీ పెళ్లంతాడు తెంపుతార్రి. అంతా ఏడుస్తారు' అని మరొక గుద్దు గుద్దాడు.

* * * *

తామాడ సుగ్రీవు వెళ్ళిపోయిన తర్వాత రకరకాల ఆలోచనలొచ్చాయి. వాడు వూళ్లో పెద్దమనుషులకు తప్పక చెప్తాడు. సర్పంచ్ తగువుకి పిలిపిస్తాడు: గుర్రాల ప్రకాశంనాయుడు అంటే ముందే వూళ్ళో పడదు. ఆ కారణంచేత బాగా రెండొందలు దాకన్నా తప్పు వేస్తారు. ఆ రెండొందలూ యజమాని దగ్గర తీసుకుని నర్తోడు చెల్లించాలి. దానికోసం నర్తోడు మరొక సంవత్సరం కంబారితనం చెయ్యాలి. అయినా తప్పు చెల్లించినా వూళ్ళో పెద్దలుగాని. తామాడ సుగ్రీవుగాని ఊరుకోరు. ఏదో ఎక్కడో ఒకసాకు తీసుకుని మళ్ళీ కొట్టిస్తారు. గుర్రాల ప్రకాశం నాయుడు తన కంబార్ని కాపాడుకోలేడు. వాడికి వూళ్ళో దిక్కులేదు ప్రస్తుతం.

రాత్రికి తగువుకు పిలుస్తారని తుంబడు, సోములూ, కృష్ణారావు, గడ్డయ్య అందరూ భయపడుతున్నారు దొంగతనంలో వాళ్ల ఉన్నందుకు వాళ్ళకూ తప్పు పడుతుంది. అయితే ఏభైఅరవైకంటె ఎక్కువ తప్పు పడకపోవచ్చు. వాళ్ల ఆ తప్పు చెల్లించటానికి మరొక సంవత్సరం కంబారితనం చెయ్యాలి.

నర్తోడు ఇంకా కోపంలో ఉన్నాడు. తామాడ సుగ్రీవుని నర్తోడు కొట్టున్నప్పుడు చాలా ఆనందం కలిగింది, ఇప్పుడు వూళ్ళో ఏమవుతుందోఅన్న భయం ఒక పక్క పట్టుకుంది. ఆ భయంలో మళ్ళీ తెగింపే వచ్చింది. 'అడుమల్లా దీనిమీద ఏమన్నా సేసినాదో– నన్ను పెద్దలంత కలిసి నరికేస్తే నరికేయనీగాని అడినుంచను. ఆ లంజకొడుకు నాకొడుకుని తిండెట్టక రోగమొస్తే సూకోనీయకుండా పనులో పెట్టి నలగ్గొట్టి సంపేసినాడు. అడు రాచ్చసుడు' అన్నాడు.

దూరంనించి గోనెల్రాముడు తుప్పలచాటునించి తిళ్ళ మోసుకొస్తూ కనపడ్డాడు.

* * * *

ఆ రాత్రి పెద్దమనుషుల్నించి తగువు కబురురాలేదు. తర్వాతా రాలేదు. పెద్ద మనుషుల దగ్గరకి ఆ తగువే పోలేదు.

కొన్నాళ్ళకి గుర్రాల ప్రకాశంనాయుడు మాత్రం బలపడ్డాడు. నర్తోడు ఇప్పుడూ గొర్రెలకాపరే అయినా– పసులకాపర్లకీ, వూళ్ళో కంబార్లకీ చెప్పుకునేందుకు బతుకుతున్న కథా వస్తువయ్యాడు.

'రోజు లొక్కలాగ కలకాలం ఉండిపోవురా-'అని చెప్తే- తుంబడు, సోములూ, గడ్డయ్యా, కృష్ణారావు దానికి సాక్ష్యం.